# ప్రజల మాట ప్రగతి బాట

# ఎల్లారెడ్డి నియోజకవర్గం

## విద్యుదాఘాతంతో యువకుడు మృతి

తాడ్వాయి, నవంబర్ 17: మండలంలోని క్రిష్ణాజివాడి గ్రామానికి చెందిన దూదేకుల ఇంతియాజ్(25) శుక్రవారం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడని ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీం గ్రామ శివారులోని సొంత వ్యవసాయ భూమిలో పౌల్ట్రీ ఫాం పెట్టుకున్నాడు. అతడి కొడుకు ఇంతియాజ్ శుక్రవారం ఉదయం కోళ్లఫారానికి విద్యుత్ సరఫరా చేస్తున్న కరెంట్ స్తంభం వద్ద వైరును సరి చేస్తున్నాడు. ఈ క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు ఎస్సై తెలిపారు. ఇంతియాజ్‌కు ఆరు నెలల క్రితమే వివాహం అయ్యిందని గ్రామస్తులు తెలిపారు.

## బీమా దరఖాస్తు అందజేత



దరఖాస్తును అందజేస్తున్న సంధ్య

తాడ్వాయి, నవంబర్ 17: మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త వజ్జేపల్లి స్వామి ఇటీవల మృతి చెందాడు. దీంతో పార్టీ బీమాకు సంబంధించిన పత్రాలను హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం అందజేసినట్లు వైస్ ఎంపీపీ నర్సింహులు తెలిపారు. స్వామికి బీఆర్ఎస్ సభ్యత్వం ఉండడంతో అతడి భార్య సంధ్య నామినీగా ఉన్నదని, బీమా డబ్బుల కోసం దరఖాస్తు చేసినట్లు చెప్పారు.

# సంక్షేమ పథకం చేరని ఇల్లు లేదు

- అభివృద్ధిని చూసి ఓర్వలేకపోతున్న ప్రతిపక్షాలు
- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్
- రామారెడ్డి మండలంలో ఎన్నికల ప్రచారం
- ఎమ్మెల్యే సమక్షంలో పలువురు బీఆర్ఎస్‌లోకి..



బోనాలు, డప్పు చప్పుళ్లతో స్వాగతం పలుకుతున్న కన్నాపూర్ గ్రామస్తులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్

రామారెడ్డి, నవంబర్ 17: రాష్ట్రంలో ప్రభుత్వ సంక్షేమ పథకం చేరని ఇల్లు లేదని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. మండలంలోని కన్నాపూర్, కన్నాపూర్ తండా, గొల్లపల్లి, మోషంపూర్, ఉప్పల్‌వాయి, గోకుల్‌తండా తదితర గ్రామాల్లో ఆయన శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కన్నాపూర్ తండావాసులు, మహిళలు సంప్రదాయ దస్తులను ధరించి, మంగళహారతులు పట్టి ఆయనకు ఘన స్వాగతం పలికారు. అక్కడ ఉన్న ధాన్యం కొనుగోలు సెంటర్ వద్దకు వెళ్లిన ఆయన.. వడ్లను సంచుల్లో నింపి రైతులకు సహాయం చేశారు. అనంతరం కన్నాపూర్ గ్రామానికి వెళ్లగా.. మహిళలు బోనాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జాజాల సురేందర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల కోసం సీఎం కేసీఆర్ ఎన్నో పథకాలను ప్రవేశ పెట్టారని అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయని విమర్శించారు. తమ పాలనలో సరిగా విద్యుత్ సరఫరా చేయని కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు ఏం మొఖం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నారని విమర్శించారు. అనంతరం ఎంపీపీ దశరథ్‌రెడ్డి మాట్లాడుతూ.. స్థానికుడైన సురేందర్ ప్రజలకు ఏ ఆపద వచ్చినా అండగా ఉంటున్నాడని అన్నారు. నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే సురేందర్‌ను మరోసారి భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని ఓటర్లను అభ్యర్థించారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాలు తనకు రెండు కండ్లు అని సీఎం కేసీఆర్ ఇటీవల ప్రకటించారని, అభివృద్ధి కోసం మరోసారి కేసీఆర్‌ను సీఎం చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పక్క జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వద్దని, స్థానికుడైన సురేందర్‌ను గెలిపించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా రంగంపేట్, ఉప్పల్‌వాయి తదితర గ్రామాలకు చెందిన 40 మంది బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే సురేందర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రంగు రవీందర్ గౌడ్, రైతుబంధు సమితి మండల కన్వీనర్ గురజాల నారాయణరెడ్డి, నాయకులు తుపాకుల రాజేందర్, పడిగెల శ్రీనివాస్, గౌస్, ల్యాగల మహిపాల్, ఇసాయిపేట్ భైరయ్య తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నాయకుల ప్రచార హోరు



పల్లెగడ్డతండాలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గాంధారి/ తాడ్వాయి/ సదాశివనగర్/ ఎల్లారెడ్డి, నవంబర్ 17: ఎల్లారెడ్డి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే జాజాల సురేందర్‌ను గెలిపించాలని కోరుతూ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. కారు గుర్తుకు ఓటేసి కేసీఆర్‌ను మరోసారి సీఎం చేయాలని ఓటర్లను కోరుతున్నారు. బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టోను ప్రజలకు వివరిస్తున్నారు.

తాడ్వాయి మండలంలోని పల్లెగడ్డ తండా, నందివాడ, తాడ్వాయి, కన్‌కల్ గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించి జాజాల సురేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిందర్‌రెడ్డి, నాయకులు వెల్మ



గాంధారిలో..

రవీందర్‌రెడ్డి, గంగాధర్, సంజీవ్, గణేశ్, సేవ్యానాయక్, రజ్యా, బాబూసింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి పట్టణంతోపాటు మండలంలో బీఆర్ఎస్ శ్రేణులు విస్తృత ప్రచారం చేపట్టారు. సురేందర్‌ను గెలిపిస్తేనే అభివృద్ధి సాధ్యమని ఓటర్లకు వివరించారు. కారు గుర్తుకు ఓటేయాలని కోరారు.

గాంధారిలో సర్పంచ్ సంజీవ్, విండో చైర్మన్ సాయికుమార్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండల కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ముస్తఫా, నాయకులు రాంకిషన్ రావు, నేరళ్ల సంతోష్, దొల్లు సాయిలు, గౌస్, మమ్మాయి భాస్కర్, పెంటయ్య, చాకలి శ్రీను, షఫీ తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్ మండలంలోని ఉత్తునూర్ గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ కారు గుర్తుకు ఓటేసి సురేందర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు గడ్డ శ్రీకాంత్, యూత్ మండల నాయకుడు మొగుళ్ల కార్తీక్‌గౌడ్, నాయకుడు శ్రీనివాస్ గౌడ్, రైతు బంధు సమితి మండల కన్వీనర్ రాజు, నాయకులు గోగునూరి బాలయ్య, మానాంజీ శ్రీకాంత్, నందివాడ శేఖర్, గైని నరేశ్, రబ్బాని, గైని రాములు, ప్రవీణ్, సంజీవ్, నర్సయ్య, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిలోని బీడీ కార్ఖానాలో..



ఎల్లారెడ్డి మండలం మాచాపూర్‌లో..

## గాంధారి పాఠశాలలో మాక్ పోలింగ్



ఓటు హక్కును వినియోగించుకుంటున్న విద్యార్థులు

గాంధారి, నవంబర్ 17: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులే ఎన్నికల విధులను నిర్వహించారు. విద్యార్థులందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. పలువురు విద్యార్థులు అభ్యర్థులుగా ఎన్నికల బరిలో నిలిచారు. అనంతరం కౌంటింగ్ నిర్వహించి విజేతలను ప్రకటించారు. హెచ్ఎం వెంకటేశ్వర్‌గౌడ్, నవీన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నేడు గాంధారి మండలంలో
## ఎమ్మెల్యే సురేందర్ ప్రచారం

గాంధారి, నవంబర్ 17: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా గాంధారి మండలంలో బీఆర్ఎస్ ఎల్లారెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థి జాజాల సురేందర్ శనివారం ప్రచారం నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శివాజీరావు శుక్రవారం తెలిపారు. మండలంలోని నేరల్ తండా, నేరల్, నాగ్లూర్, నాగ్లూర్‌తండా, దుబ్బతండా, నౌసీరాం తండా, చద్మల్, చద్మల్ తండా, బీర్మల్ తండా, జెమిని తండా, డప్పు తండా, కొత్తబాది, దుర్గం, లొంక తండా, పెద్ద గుజ్జుల్ తండా, చిన్న గుజ్జుల్ తండా, సోమారం తండా, అవుసుల కుంట తండా, గొల్లాడి తండా, తిప్పారం, తిప్పారం తండా, బొప్పాజీవాడి, బూర్గల్, సోమ్లానాయక్ తండా, పంతులు నాయక్ తండా, కరక్‌వాడి, గుడిమెట్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

## దివ్యాంగులకు ఫిజియోథెరపీ

పిట్లం/ పెద్దకొడప్‌గల్/ నిజాంసాగర్, నవంబర్ 17: పిట్లంలోని భవిత కేంద్రంలో ఎంఈవో దేవీసింగ్ ఆధ్వర్యంలో డాక్టర్ విశాలాక్షి దివ్యాంగ చిన్నారులకు శుక్రవారం ఫిజియోథెరపీ నిర్వహించారు. ఇంటి వద్ద చేయించాల్సిన వ్యాయామాలను దివ్యాంగుల తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో ఐఈఆర్టీలు కమల్‌కిశోర్, గంగాధర్ పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్‌లోని భవిత సెంటర్‌లో నిర్వహించిన ఫిజియోథెరపీ శిబిరంలో డాక్టర్ విశాలాక్షి మాట్లాడుతూ.. దివ్యాంగులకు క్రమం తప్పకుండా వ్యాయామం చేయించాలన్నారు. హెచ్ఎం విఠల్, ఉపాధ్యాయులు బలరాం, రాందాస్ పాల్గొన్నారు.

నిజాంసాగర్‌లోని మండల విద్యాశాఖ కార్యాలయంలో శిబిరంలో డాక్టర్ అరుణ్‌కుమార్ ఏడుగురు దివ్యాంగులకు ఫిజియోథెరపీ నిర్వహించారు. శిబిరంలో ఐఈఆర్టీలు సునీల్, సాయిలు పాల్గొన్నారు.

## పెండింగ్ చలాన్లను వెంటనే చెల్లించాలి

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 17: వాహనాలపై పెండింగ్‌లో ఉన్న చలాన్లను వెంటనే చెల్లించాలని ఏఎస్సై నర్సింగ్‌రావ్ అన్నారు. ఎల్లారెడ్డి పట్టణ శివారులో ఆయన పోలీసు సిబ్బందితో కలిసి శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఎన్నికల నిబంధనలను పాటించాలని, వాహనానికి సంబంధించిన అన్ని ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. ఏఎస్సై విజయలక్ష్మి, జమ్మేదార్ మధుసూదన్‌రెడ్డి, కానిస్టేబుల్ రాజేశ్వర్, స్పెషల్ ఫోర్స్ బృందం సభ్యులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డి శివారులో కారును తనిఖీ చేస్తున్న పోలీసులు